www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 24 | డిసెంబర్ | 2024 పేజీలు 8

# శ్రామికజన పక్షపాతి సిపిఐ
## యావత్ చరిత త్యాగాలమయం
### 100వ సంవత్సరంలోకి కమ్యూనిస్టు పార్టీ




రాజకీయ రంగంలో అనేక పార్టీలు పుట్టాయి. ఇందులో కొన్ని వ్యక్తిగత ప్రతిష్టను పెంచుకోవడం కోసం లేదా స్థానికంగా ఏర్పడిన బేధాభిప్రాయాలు, పదవి కాంక్ష, స్థానిక అవసరాల రీత్యా పుట్టుకొచ్చాయి. కానీ ప్రజల కోసం మాత్రమే పుట్టిన పార్టీ సిపిఐ. భారతరాజకీయ చిత్రపటంపైఅనేక పార్టీలు పుట్టాయి. కొన్ని వెనువెంటనే అదృశ్యమయ్యాయి. కొన్ని పార్టీలకు చరిత్ర లేకపోగా భవిష్యత్తు సామాజిక పురోగమి లక్ష్యాలు లేకుండా వ్యక్తుల ప్రయోజనాల కోసం, సంకుచిత ఆశయాల కోసం పనిచేశాయి. కొన్ని అయితే ఎంత త్వరగా ఎదిగాయో అంతే త్వరగా ఆ పార్టీల మనుగడ ముగిసిపోయింది. కానీ 1925వ సంవత్సరంలో ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీ 99 సంవత్సరాలుగా భారతదేశలో పీడిత, తాడిత శ్రమజీవుల, రైతు, విద్యార్థి, యువజన సమస్యల కోసం నిరంతరం పోరాడుతూనే ఉంది. బ్రిటిష్ సామ్రాజ్యవాద కాలంలో రష్యా విప్లవ విజయాలకు ప్రభావితులైన అనేక మంది విప్లవకారులు స్వాతంత్ర్య సమరయోధులు ఉన్నారు. అలా ఏర్పడ్డ కమ్యూనిస్టు గ్రూపులపై బ్రిటిష్ తీవ్ర నిర్బంధం కొనసాగించింది. 1922 నుంచి 1924 మధ్య కాలంలో విషాద, కాన్పూర్, పెషావర్, మీరట్ కుట్ర కేసులను బనాయించారు. నిర్బంధ కాండను ధిక్కరించి అన్ని కమ్యూనిస్టు గ్రూపులు ఏకమై 1925 డిసెంబర్ 26న భారత కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. కాంగ్రెస్ పార్టీ తర్వాత భారత దేశంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రమే. సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని అప్పటి కాంగ్రెస్ ఏ సభలోనూ తీర్మానం చేయని నేపథ్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ స్వాతంత్ర్యానికి డిమాండ్ చేసింది. ఎప్పుడైతే భారత కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం డిమాండ్ చేసిందో అనేక మంది విప్లవ వీరులు కమ్యూనిస్టు పార్టీ వైపు మొగ్గు చూపారు. ఆది నుంచి అంతం వరకు భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో మహోజ్వల పాత్రను నిర్వహించారు. స్వాతంత్ర్య అనంతరం కూడా అనేకానేక పోరాటాలకు కమ్యూనిస్టుపార్టీ నేత్వత్వం వహించింది. పూర్వపు ఆంధ్రప్రదేశ్‌లో భాషా సంస్కృతిక పునర్జీవనానికి, వికాసానికి బాటలు వేసింది. గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం, చిలకమర్తి లక్ష్మినర్సింహాం వంటి వారి అభ్యుదయ రచనలను వెలుగులోకి తీసుకు వచ్చింది కమ్యూనిస్టు పార్టీ. నైజాం పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజల వెన్నుతట్టి సామాన్యులను సాయుధులను చేసి ప్రపంచ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన మహోత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని నిర్వహించింది. ఈ పోరాటంలో నాలుగున్నర వేల మంది కమ్యూనిస్టులు వీర మరణం చెందారు. మూడు వేల గ్రామాలు విముక్తికాబడ్డాయి. 10 లక్షల ఎకరాల దొరల, జమీందారుల, జాగీర్‌దారుల భూమి పేద ప్రజల పరమైంది. జమీందారి, జాగీర్‌దారి వ్యవస్థకు నాటి తెలంగాణ సాయుధ పోరాటం సమాధి కట్టింది. తెలంగాణ ప్రజల్లో చైతన్యాన్ని, పోరాటాన్ని , ప్రశ్నించే తత్వాన్ని నింపింది కమ్యూనిస్టు పార్టీ మాత్రమే. తెలంగాణ ప్రజలను మభ్యపెట్టో, మాయ చేసో అందాలు ఎక్కాలని చూసిన రాజకీయ పార్టీలుఉన్నాయి కానీ తెలంగాణ ప్రజల ఆర్థిక, రాజకీయ మనో వికాసానికి, చైతన్యానికి కృషి చేసింది మాత్రం సిపిఐ ఒక్కటే. ప్రాంతాలకు అతీతంగా ప్రజల సమస్యలపై పోరాడింది. వ్యవసాయ కార్మికులు, చేనేత, గీత, బిడి కార్మికులను ఐక్యం చేసి ప్రజా ఉద్యమాలను నడిపింది. దైనందిన సమస్యల కోసం ఇప్పటికీ నిరంతరం పోరాడుతూనే ఉంది. బొగ్గు గని కార్మికుల సమస్యలపై పోరాడి అపూర్వ విజయాలను సాధించింది. బొగ్గు గనుల్లో శ్రమ దోపిడీ జరుగుతుంటే కార్మికులను పశువుల కంటే హీనంగా చూస్తూ హింసిస్తుంటే భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ను స్థాపించి కార్మికులకు హక్కులు సాధించిపెట్టింది. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ పోరాటాలే ఇరోజు సింగరేణిని సజీవంగా నిలిపాయి. ఇప్పటికీ సింగరేణి సమస్యలపై పోరాడుతున్న ఏకైక సంఘం సిపిఐ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ మాత్రమే. భారతదేశంలో ప్రజల సంక్షేమం, హక్కుల సాధన కోసం జరిగిన ప్రతి ఉద్యమం సిపిఐ నేతృత్వం వహించినవే. మారిన ఆర్థిక, రాజకీయ , సామాజిక పరిణామాల నేపథ్యంలో కమ్యూనిస్టులుగా కాస్త వెనకబడి పోవచ్చు. బూర్జువా పార్టీల ఓట్ల ఎరకు ప్రజలు మోసపోవచ్చు. కానీ పెరుగుతున్న ఆర్థిక అంతరాలు , ప్రజలు కోల్పోతున్న స్వేచ్ఛ మళ్లీ పుంజుకుంటున్న భూకమతాలు, పెరుగుతున్న నిరుద్యోగం, ఆశాంతి, మతోన్మాదం ప్రజలను మళ్లీ కమ్యూనిస్టు వైపు చూసేలా చేస్తున్నాయి. నిస్వార్థంతో పనిచేసే కమ్యూనిస్టులు మాత్రమే ప్రజా సమస్యల కోసం పోరాడగలరన్న భావన రెండు దశాబ్దాల తర్వాత తిరిగి బలపడుతుంది. జన్మత కమ్యూనిస్టు వ్యతిరేకులుసైతం కమ్యూనిస్టులు ఉండాలని కోరుకుంటున్నారు. తాము ఎప్పుడు ఎర్ర జెండాను సమర్థించని ఆ వైపు చూడని వ్యక్తులు, శక్తులు, సమూహాలు సైతం కమ్యూనిస్టులు ఉంటే పరిస్థితి ఈవిధంగా ఉండేదా మనం ఆ పార్టీలో ఉండకపోయినా మనం కమ్యూనిస్టులం కాకపోయినా కమ్యూనిస్టులు ఉండాలని కోరుకునే వారి సంఖ్య పెరుగుతుంది. అందుకే 99 ఏళ్ల తర్వాత భారతదేశ వ్యాప్తంగా పీడిత, తాడిత, శ్రామికజన రైతాంగ ఆలోచనలు ఎర్ర జెండా వైపు చూస్తున్నాయి. కొన్ని పీడివాద సిద్ధాంతాలతో ఈ పార్టీని చీల్చిన శక్తులు సైతం ఇప్పుడు విలీనం, ఐక్యత అనే పదాలను ఉచ్చరిస్తున్నాయంటే తనదైన పద్ధతిలో నిబద్ధతతో ప్రజల పక్షాన భారత కమ్యూనిస్టు పార్టీ పనిచేయడమేనన్న విషయాన్ని మనం గుర్తెరగాలి. ఐక్యతకు నిజమైన కమ్యూనిస్టులు వ్యతిరేకం కాదన్న సూక్తిని కూడా గ్రహించాలి. దేశ కళ్యాణం కోసం శ్రామికజన హక్కుల కోసం, అభివృద్ధి కోసం పాటుపడిన కష్టజీవుల ఆశాజ్యోతి కమ్యూనిస్టు పార్టీ. పాశవికమైన నిర్బంధాలను, జైళ్లను, లాఠీలను, తుపాకీ గుండ్లను ఎదిరించి మేరుపర్వతంలా నిలబడింది. ఇంతటి త్యాగాలు, ఇంతటి రక్తతర్పణ చేసిన రాజకీయ పార్టీ ఈ దేశంలోనే మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు. 99 ఏళ్ల తర్వాత సగర్వంగా మేము కమ్యూనిస్టులం. మేము అమరులకు వారసులం. అరుణ పతాక రెపరెపలను ఆస్వాదిస్తూ పురోగమనానికై అడుగులు వేస్తున్నామని చెబుతున్న ప్రతి ఒక్కరికి భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంత ఆవిర్భావ వేళ శుభాకాంక్షలు

–ఏనుగు వెంకటేశ్వరరావు, ప్రజాపక్షం/ఖమ్మం

## అర్హులైన ప్రతి ఒక్కరికి
# ఓటు హక్కు కల్పించండి

ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా ఉండాలి : ఎలక్ట్రోరల్ అధికారి బాలమాయదేవి



2లో

## వైద్యం పేరుతో
# పీడిస్తున్న గ్రామీణ వైద్యులు..!



-వైద్యం కోసం వెళ్లిన మహిళలపై లైంగిక వేధింపులు
-అవసరం లేకపోయినా గర్భిణులకు శస్త్రచికిత్సలు
-మెడికల్ షాపుల్లో ప్రభుత్వ నిబంధనలకు తూట్లు
-పట్టించుకోని జిల్లా వైద్యులు.. డ్రగ్స్ కంట్రోల్ అధికారులు

2లో

## నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మం గళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం హైదరాబాద్‌లో బయలుదేరి 11 గంటలకు ఖమ్మం చేరుకుంటారు. ఖమ్మంలో అధికారులు, అనాధికారులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రెండు గంటల వరకు ముదిగొండ, చింతకాని, బోనకల్ మండలంలోని

మిగతా 2లో..

## నేడు మంత్రి తుమ్మల పర్యటన



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెండు రోజుల పాటు ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు రఘునాథపాలెం మండలంలోని దొనబండ, ఈర్లపుడి, కొర్లబోడు తండా గ్రామాలలో సిసి రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. ఖమ్మం నగరంలోని

మిగతా 2లో..

# వైద్యం పేరుతో పీడిస్తున్న గ్రామీణ వైద్యులు..!

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రులలో నిరుపేదలకు అన్ని విధాలుగా వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక మంత్రులు కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులను తగిన సిబ్బంది నియమించి ఆసుపత్రిలో రోగులకు కావలసిన అన్ని సదుపాయాలు కల్పిస్తుంటే కొంతమంది వైద్యుల నిర్లక్ష్యం వల్ల నిరుపేదలైన రోగులు ప్రైవేట్ హాస్పిటల్ కు వెళ్లి అప్పులు చేసి వైద్యం చేసుకునే పరిస్థితి నెలకొంది ముఖ్యంగా దీనిని కారణం గ్రామీణ ప్రాంతాల్లో ఉండే గ్రామీణ వైద్యులే గ్రామీణ వైద్యుల బుద్ధి మాత్రం మారట్లేదు ప్రజలు దేవుని తర్వాత ఎక్కువగా నమ్మేది వైద్యుణ్ని అలాం టి పవిత్ర వృత్తి ఎంచుకొని కొంతమంది గ్రామీణ వైద్యులు వృత్తికి కళంకం తెస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలో వైద్యం కోసం వెళ్లిన మహిళలను లైంగిక వేధింపులకు పాల్పడు తున్నారని వివిధ గ్రామాల్లో మహిళలు ఆరోపిస్తున్నారు. కొంతమంది గ్రామీణ వైద్యులు అభం శుభం తెలియని అమాయక ప్రజలను మోసం చేస్తూ అవసరం ఉన్నా లేకున్నా గర్భిణీ

స్త్రీలను ప్రైవేట్ హాస్పిటల్ కి తీసుకెళ్లి శస్త్ర చికిత్సలు చేయించి వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు అందిస్తూ గర్భిణీ )లకు సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యత ఇవ్వాలని చెప్తున్న గ్రామీణ వైద్యులు మాత్రం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లకుండా ప్రైవేట్ హాస్పిటల్ కీ తీసుకువెళ్లి వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. కొంతకాలం క్రితం సోలిపురం గ్రామం లో అమాయక గిరిజన ప్రజలు ఐవీఎఫ్ ద్వారా సంతానం కలిగిస్తానని లక్షలు వసూలు చేసిన సంఘటనలు ఉన్నాయి అవి మరువక ముందే మేదపల్లి గ్రామం లో గ్రామీణ వైద్యుడు దళిత వ్యక్తి ఎర్నియా వ్యాధికి ఖమ్మంలోని ప్రైవేట్ హాస్పిటల్ లో పలుమార్లు శస్త్ర చికిత్స చేయించి డబ్బులు ఎక్కువ మొత్తంలో వసూలు చేసినారు. ఆయన వైద్యం వికటించి వ్యక్తి మృతి చెందాడు. ఇటీవల దమ్మాయిగూడెం గ్రామంలో ఓ గ్రామీణ వైద్యుడు జ్వరం వస్తే చిన్నారికి వైద్యం చేయగా ఆయన వైద్యం వికటించడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ కి తీసుకెళ్లి అక్కడ మృతి చెందిందని మంచిగా ఉన్న చిన్నారి ప్రాణాలు తీశారు.



గ్రామీణ వైద్యులు అరకొర చదువులు చదివి పేరు పొందిన హాస్పటల్లో కొన్ని రోజులు పని చేసి గ్రామీణ ప్రాంతాల్లో క్లినిక్ తో పాటు మెడికల్ షాపులు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత వైద్య అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం గ్రామాల్లోని మెడికల్ షాపుల్లో కంపెనీ ఔషధాలు కాకుండా జనరిక్ ఔషధాలు ఇచ్చి ప్రజల వద్ద అధిక డబ్బులు వసూలు చేస్తున్నారు. పిచ్చలవిడిగా గ్రామాల్లో మెడికల్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. మెడికల్ షాపులలో ఉండవలసిన కనీస కొలతలు పక్కా బిల్డింగు సెక్యూరిటీ పరిసరాల పరిశుభ్రత, జనాభా ప్రాతిపదికన కనీస నిబంధనలు పాటించి వారికి మెడికల్ షాపులకి అనుమతులు ఇస్తే బాగుంటుందని ప్రజల ఆరోపిస్తున్నారు. మెడికల్ షాపు బీఫార్మసీ సర్టిఫికెట్ ఒకరి పేరు మీద మెడికల్ షాప్ నిర్వాహకులు మరొకరు అవుతున్నారు. మెడికల్ షాప్ నిర్వహించే వారికి కనీసం డిగ్రీ విద్యార్హత ఉండే విధంగా జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ జిల్లా వైద్యాధికారులు చర్యలు తీసుకుంటే ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించవచ్చు కానీ వీటన్నిటికీ కారణం జిల్లా వైద్య అధికారులు పర్యవేక్షణ లేకపోవడం మెడికల్ షాప్ ల పై డ్రగ్స్ అధికారులు తనిఖీ చెయ్యకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆర్ఎంపీల పై మెడికల్ షాపుల పై చర్యలు తీసుకోకపోతే ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రజా సంఘాలు మహిళా సంఘాలు కోరుతున్నారు.


# సైబర్ నేరస్తుల అరెస్ట్

**-ఫేస్‌బుక్‌లో స్నేహం..**
**నమ్మించి 16లక్షలు చోరీ**
**-కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు**

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** వారిద్దరు స్నేహితులు.. జల్సాలకు అలవాటు పడ్డారు. ఈజీగా డబ్బు సంపాదించాలనుకున్నారు. అంతే పేరు మార్చి ఫేస్ బుక్ క్రియోట్ సైబర్ నేరాలకు తెరలేపారు. యువకులకు ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టి అన్‌లైన్‌లో పరిచాయాలు పెంచుకున్నారు. వారిని నమ్మించి విడతల వారిగా 16లక్షలు చోరి చేశారు. చివరికి సైబర్ పోలీసులకు చిక్కారు. ఇందుకు సంబంధించి సైబర్ క్రైం డిఎస్‌పి సిహెచ్ వి ఫణిందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్టణం జిల్లా నాయుడుతోట గ్రామానికి చెందిన వంకర లావణ్య, భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం జైరేసారం గ్రామానికి చెందిన సరిపల్లి శ్రీకాంత్ ఇద్దరు స్నేహితులు. వారు జల్సాలకు అలవాటుపడి సైబర్ నేరాల ద్వారా డబ్బు సంపాదించాలనుకున్నారు. ఇద్దరు బ్యాంక్ ఎకౌంట్లు ఓపెన్ చేశారు. రింక్‌లావణ్య పేరుతో వంకర లావణ్య ఫేస్‌బుక్ ఖాతా ఓపెన్ చేసి పురుషులకు ఫ్రెండ్ రెక్వెస్ట్‌లు పెట్టింది. సత్తుపల్లి పట్టణానికి చెందిన ఓ వ్యక్తి లావణ్య పెట్టిన రిక్వేస్ట్‌ను యాక్సెప్ట్ చేశాడు. వారు ఇద్దరు కొన్ని రోజులు చాటింగ్‌లు చేసుకున్నారు. వారి ఇద్దరి మధ్య పరిచయం పెరిగింది. లావణ్య సదరు వ్యక్తి నుంచి వాట్సాప్ నెంబర్ తీసుకుని చాటింగ్ చేసింది. కొద్ది రోజుల తరువాత తనకు అవసరం ఉందని కొంత నగదు కావాలని ఫిర్యాదు దారుడిని కోరింది. నిజమని నమ్మిన అతడు ఆమెకు అడిగిన నగదు పంపేవాడు. కొద్ది రోజుల తరువాత తన తల్లి అనారోగ్యంతో బాధపడుతోందని చికిత్సకు మరికొంత నగదు కావాలని లావణ్య ఫోన్‌చేసి భాదితుడిని కోరడంతో అతను ఆమెకు నగదు బదిలి చేశాడు. రోజులు గడిచాయి.. తను ఇచ్చిన నగదు తిరిగి చెల్లించాలని భాదితుడు కోరడంతో లావణ్య తన దెగ్గర ఒక చెక్కు ఉందని అది క్లియరెన్స్‌కు ఇస్తానని నగదు రాగానే బాకీ తీరుస్తానని చెప్పింది. చెక్కును క్లియరెన్స్ చేయాలంటే కొంత నగదు కావాలని అతని వద్ద నుంచి తీసుకుంది. కొంతకాలం తరువాత బాధితుడు లావణ్యకు ఫోన్‌చేసి తాను ఇచ్చిన నగదు తిరిగి ఇవ్వాలని కోరగా ఆమె వెంటనే తన ఫోన్‌ను మరోముద్దాయి శ్రీకాంత్‌కు ఇచ్చి మాట్లాడించింది. లావణ్య తనచెల్లెలు అని తరచూ తనకు ఎందుకు ఫోన్ చేసి వేదింపులకు గురిచేస్తున్నావంటూ బెదిరింపులకు పాల్పడడం ప్రారంభించాడు. లావణ్యతో చేసిన చాటింగ్‌లు ఉన్నాయని ఫోటోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశానని బెదిరించి బాధితుడి నుంచి విడతల వారిగా మొత్తం 16,05,778 రూపాయలను దోచుకున్నారని డిఎస్‌పి ఫణిందర్ వివరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఆదేశాలతో తమ సిబ్బంది, ఎస్సై రంజిత్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ నాగేశ్వరరావులు బృందంగా ఏర్పాడి గురువారం విశాఖపట్నం చేరుకుని నిందితులు శ్రీకాంత్, లావణ్యలను అదుపులోకి తీసుకుని విశాఖపట్నం కోర్డులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్ పొంది ఆఅక్కడి నుంచి ఖమ్మం తీసుకువచ్చి స్థానిక సైబర్ క్రైం కోర్డులో హజరుపరిచినట్లు ఆయన తెలిపారు. కేసును చేదించడంతో చోరవచూపిన సైబర్ క్రైం సిబ్బందిని సిపి అభినందించినట్లు తెలిపారు.

# గురుకులాల ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్

**-సాయి ఎక్స్‌లెంట్ ఆధ్వర్యంలో శిక్షణకు సిద్ధం**
**-స్కూల్ కరస్పాండెంట్ కృష్ణ ప్రసాద్**



**ప్రజాపక్షం/జూలూరుపాడుః** మండల కేంద్రమైన జూలూరుపాడులో ఉన్న సాయి ఎక్సలెంట్ స్కూల్ ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన గురుకుల ఎంట్రన్స్ పరీక్షకు శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆ స్కూల్ కరస్పాండెంట్ కృష్ణ ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. 2024 25 సంవత్సరాలకు 4, 5, 6, 7, 8 తరగతులకు తాను సాయి ఎక్సలెంట్ స్కూల్లో శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గతంలో సాయి ఎక్స్లెంట్ స్కూల్ శిక్షణ ద్వారా ఎంతో మంది విద్యార్థులను గురుకుల, నవోదయ, ఏకలవ్య పాఠశాలకు పంపి విజయం సాధించామని అన్నారు. గురుకులాల్లో ఐదవ తరగతి పరీక్షల ప్రవేశానకై 23225న పరీక్ష జరుగుతుందని పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం1 గంట వరకు ప్రభుత్వం ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో జరుగుతుందని. గురుకులాల్లో సీటు కోసం ప్రయత్నం చేసే విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు తమ అర్హతలను పరిశీలించుకుని 21 12 2024 నుండి 12 2025 వరకు ఆన్లైన్లో 100 రూపాయల రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని, ఒకే ఫోన్ నెంబర్ తో పాటు దరఖాస్తు మాత్రమే చేయాలనే నిబంధన ఉందన్నారు. విద్యార్థులకు సాయి ఎక్సలెంట్ స్కూల్లో జనవరి 18 తారీకు నుంచి క్లాసులు ప్రారంభమవుతాయని. ప్రవేశ పరీక్షలో సీట్లు సాధించిన వారికి కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించనున్నట్లు ఈ అవకాశాన్ని విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాల కోసం సాయి ఎక్సలెంట్ స్కూల్ 9441700094 మరియు 9440296832 కు కాల్ చేసి మరిన్ని వివరాలను పొందవచ్చు అన్నారు.

# నేడు డిప్యూటీ సిఎం భట్టి పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

వివిధ కమిటీలకు చెందిన బాధ్యులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 3.30కు ఖమ్మం నుంచి బయలుదేరి మధిర చేరుకుని అధికారులు, అనాధికారులను కలుస్తారు. అనంతరం మధిర , ఎర్రుపాలెం మండలాలకు చెందిన వివిధ కమిటీల బాధ్యులతో సమావేశమవుతారు. మంగళవారం రాత్రి మధిర మండలం బయ్యారం గ్రామంలో జరిగే క్రిస్మస్ ఉత్సవాల్లో పాల్గొని మధిరకు చేరుకుంటారు. బుధవారం ఉదయం బయలుదేరి హైదరాబాద్ వెళ్తారు.

# నేడు మంత్రి తుమ్మల పర్యటన

(మొదటిపేజీ తరువాయి)


చర్చికాంపౌండ్‌లోని చర్చిలో జరిగే క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొంటారు. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు సత్తుపల్లి మండలం బుగ్గపాడులో బుగ్గపాడు నుంచి నాగుపల్లి వరకు నిర్మించే ఆర్అండ్‌బి రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. కాకర్లపల్లిలో సిసి రోడ్డుకు శంకుస్థాపన చేసిన అనంతరం సహకార సంఘ భవనాన్ని ప్రారంభిస్తారు. 11 గంటలకు తల్లాడ మండలం నూతన్‌కల్‌లో నిర్మించిన సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తారు. 12 గంటలకు ఖమ్మం నగరంలోని శ్రీరాం హిల్స్‌లో బిటి రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించండి

**ప్రజాపక్షం/ఖమ్మం :** 18 సంవత్సరాలు నిండి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ బి. మాయదేవి తెలిపారు. ఓటర్ల సవరణ జాబితా 2025కు సంబంధించి నూతనంగా నమోదవుతున్న వారి వివరాలను ర్యాండమ్‌గా పరిశీలించాలని సూచించారు. సోమవారం అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, శ్రీనివాసరెడ్డి లతో కలిసి ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాలమాయదేవి మాట్లాడుతూ ప్రతి అభ్యంతరంను, ప్రతి దరఖాస్తును పూర్తి స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఓటరు జాబితా నుంచి ఓటు తీసే సమయంలో స్పష్టమైన సమాచారం ఉండాలని సహేతుకమైన కారణం ఉంటేనే తొలగించాలని ఆమె సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని ఆమె సూచించారు. జిల్లాలో డ్రాఫ్ట్ ఓటరు జాబితా సందర్భంగా ఫారం ఆరు, 6ఎ,7,8 దరఖాస్తులు 21,274 రాగా ఇప్పటి వరకు 18, 192 దరఖాస్తులను పరిష్కరించామని జేసిలు శ్రీజ, శ్రీనివాసరెడ్డిలు తెలిపారు. 2,977 దరఖాస్తులను తిరస్కరించామని, 175 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నవంబర్ నెలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినప్పుడు 1,181 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌వో రాజేశ్వరి, ఆర్డివోలు నర్సింహారావు, రాజేందర్ లతో పాటు తహసీల్దార్లు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# అగ్రరాజ్యంలో అగ్రగామి ఆటగాడిగా తెలుగోడు






**ప్రజాపక్షం/తల్లాడ :** అగ్ర రాజ్యం అమెరికాలో ప్రవాస భారతీయుడు అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు. క్రీడా రంగంలో అత్యుత్తమ ప్రతిభ చూపుతూ అనేక అవార్డులను గెలుచుకుంటున్నాడు. అతనే యన్నం రోహన్. ఖమ్మంజిల్లా తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామానికి చెందిన యన్నం శ్రీనివాసరెడ్డి, పద్మ దంపతులు అమెరికాలో స్థిర పడ్డారు. వారి కుమారుడు యన్నం రోహన్ న్యూజెర్సీ రాష్ట్రంలోని అమెరికా ఇంటర్మీడియట్ కాలేజీ స్థాయిలో ఫుట్‌బాల్ ఆటలో అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ 2024 అవార్డుతో పాటు బెస్ట్ డిఫెన్స్, బెస్ట్ ప్లేయర్ అవార్డును గెలుచుకున్నాడు. అగ్ర రాజ్యంలో భారతీయ సంతతికి చెందిన ఆటగాడు ఇటువంటి బహుమతిని గెలుచుకోవడం ఇదే ప్రథమం. తల్లిదండ్రుల ప్రోత్సహమే ఇందుకు కారణమని రోహన్ తెలిపారు. తమ గ్రామానికి చెందిన రోహన్ అమెరికాలో అత్యుత్తమ ప్రతిభ చూపి అవార్డులను గెలుచుకోవడంతో గ్రామస్తులు హర్షం తెలియజేస్తున్నారు.

# క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో ఏఐటియుసి విజయం





**ప్రజాపక్షం/ఖమ్మం :** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సెంట్రల్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో ఏఐటియుసి అభ్యర్థులు విజయం సాధించారు. బి.రవీందర్, ఆర్.రవికుమార్‌లు ప్రత్యర్థులపై భారీ మెజార్టీతో విజయం సాధించారు. మొత్తం ఆరు స్థానాలకు ఎన్నికలు జరగగా ఏఐటియుసి రెండు, ఐఎన్‌టియుసి మూడు, తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఒక స్థానంలో విజయం సాధించాయి.

# పోలీసుల పేరుతో బెదిరింపు.. కేసు నమోదు

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** పోలీసులమని చెప్పి ఓ డ్రైవర్‌ను బెదిరించి దాడిచేసిన ఘటనలో సదరు వ్యక్తులపై టూటౌన్ పోలీసులు కేసునమోదు చేశారు. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మణుగూరుకు చెందిన ఇసుక టిప్పర్ లారి అన్ని అనుమతులతో ఖమ్మం వచ్చి అన్‌లోడు చేసి తిరుగి వెళ్తున్న క్రమంలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మాదవరావు, హర్ష, నాగరాజు అనే ముగ్గురు వ్యక్తులు అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుక రావాణ చేస్తున్నావని పోలీసులు లారిని అపమన్నారని చెప్పి డ్రైవర్ ను బెదిరించి దాడిచేసి వాహనానికి చెందిన తాళాలను లాక్కున్నారు. దీంతో బాధితుడు టూటౌన్ పోలీసులస్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు. సదరు వ్యక్తుల కోసం గాలిసున్నామన్నారు.

# రైతు వ్యతిరేక విధానాలు మానుకోవాలి

**-26న ఖమ్మంలో సిపిఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి**

**-సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి**



**ప్రజాపక్షం/చింతకాని :** కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానలను తక్షణమే మానుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి డిమాండ్‌చేశారు. సోమవారం చింతకాని మండలం బస్వాపురం గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకున్న నల్లచట్టాలను తిరిగి అమలు చేసే కుట్ర చేస్తున్నదన్నారు.గిట్టుబాటు ధరల చట్టం చేయాలని 10నెలలుగా డిల్లీ సరిహద్దుల్లో రైతులు ఆందోళన చేస్తుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదన్నారు. రైతు ప్రభుత్వమని హామీలు గుప్పిం చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి రుణమాఫీ చేయలేదన్నారు.రైతు భరోసా ఇవ్వకపోవడంతో ప్రజా వ్యతిరేకత మూటగట్టుకుందన్నారు. రైతును మోసం చేసిన ప్రభుత్వాలు మనుగడ సాధించలేదన్నారు. తక్షణమే రైతు రుణమాఫీ,రైతుభరోసా ఇవ్వకపోతే సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతు ఉద్యమం చేపడతామన్నారు. డిసెంబర్ 26 న సీపీఐ శతజయంతి సందర్భంగా ఖమ్మం నగరంలో నిర్వహించే భారీ ప్రదర్శనలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి పావులూరి మల్లిఖార్జున రావు,పార్టీ జిల్లా సమితి సభ్యులు పగడిపల్లి ఏసు, రాసాల మోహన్‌రావు,మార్గం శ్రీను,నాయకులు బొడ్డు కొండలరావు,బద్దల నర్సింహారావు ,ఆవుల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ మోడల్ హౌజ్‌కు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే





**ప్రజాపక్షం/వైరా :** కేసిఆర్ పాలనలో పేదలకు ఇండ్లు లేక అనేక ఇబ్బందులు పడ్డారని ఎంఎల్‌ఎ మాలోత్ రాందాస్ నాయక్ తెలిపారు. సోమవారం వైరా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇంఇరమ్మ ఇండ్ల కార్యక్రమానికి భూమి పూజ కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ రాందాస్ నాయక్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసిఆర్ పాలనలో ప్రజలు నరకయాతన పడ్డారని తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిన తర్వాత వారి కలలు నెరవేరబోతున్నాయని నియోజక వర్గ వ్యాప్తంగా ప్రతి మండలంలో ఇందిరమ్మ ఇండ్లు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. నిరుపేద కుటుంబాలు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని ఈ మోడల్ హౌజ్ ఏర్పాటు ఉద్దేశమన్నారు. ప్రజలు ఇంటి నిర్మాణాన్ని అనుకూల బడ్జెట్‌లో పూర్తయ్యే విధంగా రాష్ట్ర ప్రభుత్వం విధి విధానాలను రూపొందించి నియోజక వర్గంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ ఛైర్మన్ సూతకాని జైపాల్, కౌన్సిలర్ కన్నెగంటి సునీత, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎదునూరి సీతారాములు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలంవెంకటనర్సిరెడ్డి, బోళ్ల గంగారావు, దర్నా రాజశేఖర్, ఫణితి శ్రీను, మల్లు రామకృష్ణ, ఎదునూరి శ్రీను, కన్నెగంటి హుస్సేన్, ఇటికల మురళి, పఠాన్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సల్ విద్యాలయంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు






**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడలో యూనివర్సల్ విద్యాలయం నందు సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాల ఏసు మేకల పాకను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ టికె ప్రసన్నన్ కేక్ కట్ చేసి అందరితో ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం టికె ప్రసన్నన్ మాట్లాడుతూ సాటి మనుషుల పట్ల సోదర భావం, మానవత్వం, దయ, జాలి, ప్రేమ కలిగి ఉండడం అందరిని సమానంగా చూడటం, ఆపదలో ఉన్న వారికి అండగా ఉండడం ఏసుక్రీస్తు యొక్క సందేశమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మేరీసోఫియా, మోహన్, యాకూబ్, సమత, మనీషా, అరుణ, నాగేశ్వరరావు, రోహిణి, రాము, కృష్ణవేణి, బీజాన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాల బాలురకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ





**ప్రజాపక్షం/వైరా :** వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కళాశాల బాలురకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ప్రముఖ వ్యాపారవేత్త రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కాళ్ల ఫండేషన్ ఛైర్మన్ అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు ఐక్యత రాగంతో కలిసి మెలిసిగా ఉండి కుటుంబ సభ్యులను గౌరవిస్తూ వారి సూచనలు, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో దివ్యాంగులు కళ్లు కనిపించకుండా బాధపడుతుంటే వారి వివరాలను మాకు అందజేస్తే వారికి అండగా ఉంటామని తెలిపారు. వైష్ణవి ఫుడ్స్ అండ్ మిల్క్ ఛైర్మన్ మురళీధర్‌రావు మాట్లాడుతూ సమాజానికి చేతనైనంత సాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రోటరీ క్లబ్ అధ్యక్షులు రవీంధర్, సుధాకర్‌రావు, పసుమర్తి రంగారావు, భూషణ్‌రావు, రామారావు, కళాశాల ప్రిన్సిపాల్ నవీనాజ్యోతి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురంలోని ఎమిలీ పబ్లిక్ స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుక సందర్భంగా కరస్పాండెంట్ గోపీనాథ్ మాట్లాడుతూ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని, అదే విధంగా ప్రతి ఒక్కరూ ప్రేమ, శాంతి, సహనంతో ఉండాలని క్రీస్తు బోధనలను వివరించారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రతి ఒక్కరికి చాకెట్లు, మిఠాయిలు పంచారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయురాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్ క్విజ్ పోటీలో న్యూవిజన్‌కు ప్రథమస్థానం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** గురుదక్షిణ పౌండేషన్ వారు విద్యార్థుల్లో దాగియున్న సైన్స్ పరిజ్ఞానాన్ని వెలికితీయుటకు జిల్లాలోని అన్ని యజమాన్యాల పరిధిలోని ప్రభుత్వ, ప్రభుత్వేతర పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీలో నగరంలోని న్యూవిజన్ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో జిల్లా స్థాయి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు ఒలంపియాడ్ స్కూల్ ప్రిన్సిపాల్ జేవి మైఖేల్ తెలిపారు. గురుదక్షిణ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సైన్స్ క్విజ్ పోటీలో వివిధ ప్రాంతాల నుండి వందకు పైగా పాఠశాలలు పాల్గొనగా న్యూవిజన్ పాఠశాలకు చెందిన ఎండి అయాన్, కె. ఉజ్వల్ ప్రథమ బహుమతిని గెల్చుకోవడం జరిగిందన్నారు. ప్రథమ బహుమతి క్రింద రెండు ల్యాప్‌టాప్‌లు పొందినట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా సోమిరెడ్డి పాల్గొని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యూవిజన్ విద్యా సంస్థల ఛైర్మన్ సిహెచ్‌జికె ప్రసాద్, అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్ కార్తీక్, క్విజ్ మాస్టర్ ధనుష్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

# కళా వేదికకు స్థలం కేటాయించాలని ఎంఎల్‌ఎకు వినతి



**ప్రజాపక్షం/వైరా :** వైరాలో కళా వేదికకు స్థలం కేటాయించాలని సోమవారం వైరాలో ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయం నందు ఎంఎల్‌ఎ రాందాస్ నాయక్‌కు కళాకారులు వినతి పత్రం సమర్పించారు. వైరా పట్టణంలో గతంలో రాష్ట్రస్థాయి నాటిక పోటీలు నిర్వహించిన సందర్భాలు ఉన్నాయని ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రాందాస్ నాయక్ స్థలం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కట్టా కృష్ణార్జునరావు, దాసరాజు కుటుంబరావు, చల్లా కృష్ణారావు, సిహెచ్ వెంకటేశ్వరరావు, ఎస్‌కె పాషా, పూర్ణకంటి రామారావు, తల్లపురెడ్డి గోపాల కృష్ణారెడ్డి, ఊరుకొండ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నేత్రా ఐకేర్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు



**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో నేత్రా ఐకేర్ ఆధ్వర్యంలో సూతకాని శ్రీకాంత్ గత 16 ఏళ్లుగా సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నారు. సోమవారం జరిగిన ఈ వేడుకల్లో ఎంఎల్‌ఎ మాలోత్ రాందాస్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రభోదించిన ప్రేమ మార్గంలో అందరూ పయనించాలన్నారు. గత 16 ఏళ్లుగా సూతకాని శ్రీకాంత్ సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ ఛైర్మన్ సూతకాని జైపాల్, వైస్ ఛైర్మన్ ముళ్లపాటి సీతారాములు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఎదునూరి సీతారాములు, బొంతు రాంబాబు, కంకణాల అర్జున్‌రావు, వనమ విశ్వేశ్వరరావు, రాజశేఖర్, పమ్మి అశోక్, మిట్టపల్లి కిరణ్, పమ్మి తిరుమలరావు, బి. గంగారావు, ఫణితి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప అన్నదాన కార్యక్రమంలో కట్టా దంపతులు



**ప్రజాపక్షం/వైరా :** వైరా మాజీ ఎంపిపి, బిఆర్‌ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జున్ రావు కట్టా స్వరూపరాణి దంపతులు సోమవారం వైరాలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్పలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పలకు వారు స్వయంగా అల్పాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వనమా విశ్వేశ్వరరావు, కొప్పురావూరి వెంకటకృష్ణ, రంగా జానయ్య, పెనుగొండ రామారావు, నూకల వాసు, వజినేపల్లి చక్రవర్తి, వీరబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వజ్ఞలో సెమీ క్రిస్మస్ వేడుకలు



**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు నీలిమ, ఆర్‌వి నాగేంద్ర కుమార్ లు మాట్లాడుతూ పశువుల పాక, క్రిస్మస్ ట్రీలతో, నక్షత్రాలతో, దేవదూతల వేషధారణలతో చిన్నారులు ప్రాంగణమంత క్రీస్తు జన్మ స్థలాన్ని తలపించేలా అలంకరించారు. చిన్నారులు శాంతాక్లాస్ వేషధారణలతో తోటి స్నేహితులకు బహుమతులను అందజేశారు. సర్వమతాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. సహనం, శాంతి, ప్రేమ, క్షమాగుణం, కరుణ అలవర్చుకోవాలన్నారు. క్రీస్తు వలే శత్రువులను సహితం ప్రేమించే, క్షమించే గుణం కలిగి ఉండాలని విద్యార్థులకు సందేశమిచ్చారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి చిన్నారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# భూమి లేని పేదలకు ఒకే దఫా ఆర్థికసాయం అందించాలి



**-వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాటి**

**ప్రజాపక్షం/ఖమ్మం :** భూమిలేని, నిరుపేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ. 12వేల ఆర్థిక సాయాన్ని ఒకే దఫా అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రకృతి విపత్తులు జాతీయ ఉపాధి హామీ పథకం సరైన రీతిలో అమలు కాకపోవడం తదితర కారణాలతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి సమావేశం సోమవారం జిల్లా అధ్యక్షులు పగిడిపల్లి ఏసు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో తాటి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో జాప్యం చేసిందని ఇప్పుడు కూడా మొదటి దఫా ఆరువేలను డిసెంబర్ 28న ఖాతాల్లో జమ చేస్తామని చెబుతున్నారని అలా కాకుండా ఒకే దఫా రూ.12వేలు జమ చేయడం వల్ల పేదలకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుందన్నారు. ఈ పథకం లబ్ది దారుల ఎంపికకు సంబంధించి ఇంత వరకు విధి విధానాలను రూపొందించలేదని వెంటనే విధి విధానాలను రూపొందించి పారదర్శకంగా లబ్దిదారులను ఎంపిక చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వృద్దాప్య పింఛన్లను నాలుగు వేల రూపాయలకు పెంచుతామని చెప్పినప్పటికి ఏడాది గడిచిన దానిని ఇంత వరకు పెంచలేదని దానిని కూడా కనీసం జనవరి మాసం నుంచి పింఛన్లను పెంపుదల చేయాలన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో ఒకట్రెండు మినహా మిగిలిన వాటి విషయంలో తీవ్ర జాప్యం చేస్తుందని కొన్నింటి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తుందని తాటి ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చక పోతే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని తాటి వెంకటేశ్వరరావు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పగిళ్ల వీర భద్రం, వీరబాబు, చీనా, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**కాంగ్రెస్ జిల్లా నాయకులు చావా శివరామకృష్ణ**

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను యువజన కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు చావా శివ రామకృష్ణ అన్నారు. తిరుమలాయపాలెం మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గా పిండిప్రోలు గ్రామానికి చెందిన దూదిమెట్ల వెంకట్ ను యువజన ఎన్నికల్లో గెలుపు కోసం ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన జిల్లా కాంగ్రెస్ నాయకులు చావా శివరామకృష్ణ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను సాల్వతో సత్కరించి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు దూదిమెట్ల వెంకట్ పిండిప్రోలు గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో చర్చించి సమస్యలు పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ ఫలాలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రావూరి యాకుబ్ రావు, దొడ్డ గురవయ్య, ఉడుగుల బిక్షం, సలీం, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ప్రధాని పివి 20వ వర్ధంతి



**- పూలమాల వేసి నివాళులర్పించిన రాష్ట్ర నాయకడు డా.మట్టా**

**ప్రజాపక్షం /సత్తుపల్లి :** పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం ఎదురుగా ,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు ఆధ్వర్యంలో భారతదేశ మాజీ ప్రదాని పివి నర్సింహారావు 20వ వర్ధంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ ముఖ్య అతిధిగా హాజరై పివి నర్సింహారావు కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళ్ళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ప్రదానిగా పివి నర్సింహారావు ఆర్థిక రంగాన్ని గాడిలో పెట్టారని, ర్థిక రంగ నిపుణుడిగా ఆయన చేసిన పలు సంస్కరణల మూలంగా భారత ఆర్థిక వ్యవస్థ శరవేగంగా అభివృద్ధి పదంలో పయనించిందన్నారు. పార్టీకి. ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ళ నర్సింహారావు, దొడ్డా శ్రీనివాసరావు, ఇమ్మనేని ప్రసాద్, కౌన్సిలర్లు దూదిపాళ్ళ రాంబాబు, నాగుల్ మీరా, నాగలక్ష్మి , పద్మజ్యోతి, దొడ్డాకుల గోపాలరావు, అలవాల కరుణాకర్,ఇనపనూరి శ్రీనివాసరావు, పింగళి సామ్యూల్‌రాజు, పాపారావు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ దొంగలను పట్టుకున్న కూసుమంచి పోలీసులు



**విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన సీఐ సంజీవ్**

**ప్రజాపక్షం/కూసుమంచి :** కూసుమంచి నేలకొండపల్లి, ఖమ్మం రూరల్, సూర్యపేట జిల్లా గరిడేపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో ట్రాక్టర్లు దొంగతనాలు చేస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద రెండు ట్రాక్టర్ ఇంజిన్లు, 7 ట్రాక్కులను స్వాధీనపరచుకున్నట్లు కూసుమంచి సర్కిల్ ఇన్స్పెక్టర్ సంజీవ్, ఎస్సై నాగరాజు తెలిపారు. సోమవారం కూసుమంచి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ, వాహనాల తనిఖీల్లో భాగంగా కూసుమంచి శివారులో గల క్రషర్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా సూర్యాపేట జిల్లా మునగాల మండలం కొక్కిరేణి గ్రామానికి చెందిన నూకా వీరబాబు, దాసరి నాగరాజు, దేవర శ్రీధర్ లు రెండు ట్రాక్టర్లు వేసుకొని వస్తున్న ముగ్గురు వ్యక్తులను ఆపి పరిశీలించగా వారి వద్ద దొంగిలించిన రెండు ట్రక్కులను, వారు దొంగతనమునకు ఉపయోగించిన రెండు ట్రాక్టర్ ఇంజన్లలను, కూసుమంచి నేలకొండపల్లి ఖమ్మం రూరల్ మరియు సూర్యపేట జిల్లా గరిడేపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనం చేసి అమ్మిన ఐదు ట్రక్కులను దొంగతనం చేశారని తెలిపారు. వారు దొంగతనం చేసిన ట్రక్కులను కూసుమంచి మండలం చేగోమ్మకు చెందిన బొల్లం సైదులు, నేలపట్ల గ్రామానికి చెందిన నూకల చిన్న సైదులకు అమ్ముతున్నట్లు తెలిపారు. ముగ్గురు కలిసి పథకం ప్రకారం ట్రాక్టర్ ట్రక్కులను దొంగతనాలు చేస్తున్నారని తెలిపారు. బొల్లం సైదులు మరియు నూకల చిన్న సైదులు కూడా ట్రక్కులు తీసుకున్నట్లు నేరం ఒప్పుకున్నారు. వారు దొంగతనం చేసిన ఒక్కొక్క ట్రక్కును 60 వేలకు అమ్మినారు. అట్టి వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్కు పంపడం జరిగిందని పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన కూసుమంచి ఎస్ఐ నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ పి వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ శ్రీశైలం, గోపి, హోంగార్డ్ రాంబాబు రమేష్ లను కూసుమంచి సీఐ సంజీవ్ అభినందించి ఈ సందర్భంగా కొంత రివార్డ్ ను బహుమతిగా అందించారు. దొంగతనానికి పాల్పడిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు పంపడం జరిగిందని పోలీసులు తెలిపారు.ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు. ఈ సమావేశంలో తిరుమలాయపాలెం ఎస్సై జగదీష్, నెలకొండపల్లి ఎస్సై జగదీష్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి తక్షణమే సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి షేక్ చాంద్ పాషా ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 13 రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తా ఉంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి వారితో చర్చించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా టిఆర్ఎస్ ప్రభుత్వం వలే కాకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించి వారు కోరుకుంటున్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, కేజీబీవీ విద్యాసంస్థల్లో పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు చదువు అందేలా చూడాలని వారు తెలిపారు. లేని పక్షంలో వారికి అండగా ఉంటూ పెద్ద ఎత్తున పోరాటాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మిట్టగూడెం నందు సమావేశం ఏర్పాటు చేశారు. మండల విద్యాశాఖ అధికారి వీర స్వామి మాట్లాడుతూ ఈనెల 28,29,30 తేదీలలో నల్లగొండ జిల్లాలో జరిగే రాష్ట్ర మహా సభను విజయవంతం చేయడం కోసం మన మండలం నుండి ఎక్కువ సభ్యులు హాజరు కావాలని కోరారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీతారామయ్య, చంద్రు, రాష్ట్ర కార్యదర్శది ఎన్ కృష్ణ, బి రాము, మంగీలాల్, సునీత, ముషీరా, శ్రీను, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సేవాలాల్ బంజారా సంఘం స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా దేవీలాల్ నాయక్ ఏకగ్రీవ ఎన్నిక



**ప్రజాపక్షం/పాల్వంచ:** హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన వేదికలో జరిగిన సేవలాల్ బంజారా సంఘం స్థాపించి 10 సంవత్సరాలు గడిచిన సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుండి రెండు వేల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈసభలో సేవలాల్ బంజారా సంఘం స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మోతిలాల్ నాయక్ నియామక పత్రం అందజేశారు. ఈసందర్భంగా దేవిలాల్ నాయక్ మాట్లాడుతూ గిరిజన జాతి సమస్యలపై తన పోరాటం ఉంటుందని జాతి శ్రేయస్సు కోసం పాటు పడతానని బంజారా జాతి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో సేవలాల్ బంజారా సంఘం జాతీయ అధ్యక్షులు గాంధీనాయక్, రాష్ట్ర అధ్యక్షులు చందు నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కుక్కమూడి అనిల్‌కు నివాళి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** అన్నపురెడ్డిపల్లి మండలం పెంట్లం గ్రామంలో సోమవారం జరిగిన కుక్కమూడి అనిల్ దశదిన కర్మకు జూలూరుపాడు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై వారి చిత్రపటానికి, పూలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు వేల్పుల నరసింహారావు, మోదుగు రామకృష్ణ, పోతురాజు నాగరాజ్, పోతురాజు సుదర్శన్, చేపలమడుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించిన డీపిఓ



**ప్రజాపక్షం/ముదిగొండ :** మండల పరిధిలోని న్యూ లక్ష్మీపురం, కమలాపురం గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ను సోమవారం జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత పరిశీలించారు. గ్రామాల్లో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లు సర్వే యాప్ లో ఏమైనా సాంకేతిక లోపాలు ఉన్నాయని ఆమె కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఇందిరమ్మ లబ్ధిదారుల సర్వే ఎంత వరకు అయ్యిందని ఆమె కార్యదర్శులతో మాట్లాడి క్షేత్రస్థాయిలో సర్వే పరిశీలించారు. ఆ తరువాత సర్వే లో ఎటువంటి లోటుపాట్లు, పొరపాట్లు లేకుండా చూడాలని, పకడ్బందీగా నిర్వహించాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి వాల్మీకి కిషోర్, పంచాయతీ కార్యదర్శులు డేగల సురేష్, భూక్యా నరేష్ లు పాల్గొన్నారు.

# పాలేరులో ఓఎన్ఎమ్ ఈఎన్‌సి పర్యటన



**ప్రజాపక్షం/కూసుమంచి :** మండలంలో ని సోమవారం ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ పాలేరు రిజర్వాయర్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇటీవల వచ్చిన వరదలకు దెబ్బతిన్న ఎన్నెస్పి కాలువ గేట్లను, ఇంకా పాలేరు రిజర్వాయర్ కట్టను పరిశీలించారు ఓఎన్ఎమ్ ఈఎన్సి విజయ్ భాస్కర్ రెడ్డి, అధికారులతో మాట్లాడుతూ, ఎన్ఎస్పి కాలువలను నిరంతరం పరిశీలిస్తూ ముందుచూపుతోనే వ్యవహరించాలని, పలు విధాలైన సూచనలు సలహాలు అధికారులకు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ జిల్లా ఎస్ ఇ మంగళంపూడి వెంకటేశ్వర్లు, డివిజన్ స్థాయి అధికారులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# సర్వశిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్**

**ప్రజాపక్షం/ఖమ్మం :** 13 రోజులుగా సమ్మె చేస్తున్న సర్వ శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. సమ్మెను పరిష్కరించకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ముఖ్యంగా విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందని ఆయన తెలిపారు. కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులకు సోమవారం సిపిఐ పక్షాన పూర్తి మద్దతు తెలిపారు. ఆందోళన చేస్తున్న ఉద్యోగులను ఉద్దేశించి సురేష్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సర్వ శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని కాని అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించడం తగదన్నారు. ముఖ్య మంత్రి తక్షణం జోక్యం చేసుకుని సమస్యకు పరిష్కారం చూపాలని సురేష్ డిమాండ్ చేశారు. సర్వ శిక్షా ఉద్యోగుల శ్రమ దోపిడీ జరుగుతుందని వారిని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని లేదంటే వేతన సవరణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. విద్యా రంగ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇస్తున్న ప్రభుత్వం కస్తూర్బా, సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. మద్దతు తెలిపిన వారిలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి తోట రామాంజనేయులు, సిపిఐ నాయకులు నంబూరి శంకర్‌రావు ఉన్నారు.

## పేదవాడి సొంతింటి కల నెరవేర్చటమే
# కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే జారే**

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** పేదవాడి సొంతింటి కలని నెరవేర్చటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆది నారాయణ అన్నారు. సోమవారం అశ్వారావుపేట నియోజకవర్గంలో త్వరలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించే ఇందిరమ్మ ఇండ్ల నమూనా ఇంటి నిర్మాణ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదవాడి సొంతింటి కలని నిజం చేయటానికి వారి ఆశను నెరవేర్చడానికి ఇందిరమ్మ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని, అందుకు అనుగుణంగా త్వరలోనే ఈ నియోజకవర్గానికి 3500 ఇండ్లు నిర్మించి పేదలకు అందిస్తామన్నారు. అలాగే ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు షరతులు లేవని, లబ్ధిదారులు వారి ఆర్థిక వెసులుబాటును బట్టి నిర్మించుకోవచ్చునన్నారు. ఈ ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతిఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఐదు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు.

# ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్ జిల్లాలో సంచలనం

**ప్రజాపక్షం/భద్రాచలం:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లా గిరిజన మాజీ మావోయిస్టును చర్చల కోసం దట్టమైన అడవులలోకి పంపించిన భద్రతా బలగాలు, అబూజ్మడ్ అడవులలోకి మావోయిస్టులతో చర్చల కోసం లొంగిపోయిన ఒక గిరిజన మాజీ మావోయిస్టును అబూజ్మడ్ అడవులలోకి పంపిన భద్రతా బలగాలు, రోజుల గడుస్తున్నా అతని ఆచూకి ఇప్పటి వరకు తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన. వెళ్లే ముందు కేంద్ర హోం మంత్రి విజేయ్ శర్మ, బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ పి తో మాట్లాడి మావోయిస్టుల దగ్గరకు వెళ్లినట్లు తెలుస్తోంది. అతను మాత్రం వెళ్లే ముందు హింసా కాండ అవసరం లేదని శాంతి చర్చలు జరిపేందుకు మావోయిస్టుల దగ్గరికి ప్రభుత్వం తరపున వెళుతున్నానని, దాదాపు ఒకటిన్నర నిమిషాల సెల్ఫీ వీడియో తీసుకొని ఎంకేయురియా అనే ఐడితో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసినట్లు తెలుస్తుంది. ఇప్పుడు ఆ వీడియో వైరల్ గా మారింది. ఐతే చర్చల కోసం వెళ్లిన గిరిజన మాజీ నక్సలైట్ మళ్ళీ మావోయిస్టులతో చేరి పోయాడ...లేక మావోయిస్టులు అతన్ని అదుపులోకి తీసుకున్నారా అనే కోణంలో, అంతేకాకుండా ఈ సెల్ఫీ వీడియో ఏ నెట్వర్క్ పరిధిలో ఎప్పుడు చేశాడనే కోణంలో కూడా విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది.



# చిరస్మరణీయుడు తమ్మారపు భద్రయ్య



**-సిపిఐ శత జయంతి ఆవిర్భావ సంబుర సభను జయప్రదం చేయండి**
**-సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు**

**ప్రజాపక్షం/బోనకల్:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, అమరజీవి తమ్మారపు భద్రయ్య చిరస్మరణీయుడని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు తమ్మారపు భద్రయ్య 11వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ తమ్మారపు భద్రయ్య అనేక కమ్యూనిస్టు ఉద్యమ పోరాటాల్లో కీలక భూమిక పోషించరని అన్నారు. సోదరుడు సిపిఐ సీనియర్ నాయకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శిగా తమ్మారపు గోవిందు నాడు అనేక పోరాటాలు నిర్వహించారని, ఆయన అడుగుజాడల్లో భద్రయ్య పనిచేశారని అన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన సమయంలో రహస్య జీవితాన్ని గడిపిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. గోవిందాపురం(ఎల్) భద్రయ్యను ఎన్నటికి మరువదని, ఆయన జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోని కమ్యూనిస్టు పార్టీలలో పనిచేయాలని సూచించారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే శత జయంతి వేడుకలను సిపిఐ శ్రేణులు, సానుభూతిపరులు పెద్ద ఎత్తున్న పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు తమ్మారపు వెంకటేశ్వర్లు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# 26న కొత్తగూడెంలో సిపిఐ వసంతోత్సవ ర్యాలీ




**ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్:** భారత కమ్యూనిస్టు పార్టీ వందో ఏట అడుగుపెడుతున్న సందర్భంగా ఈనెల26న సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో వసంతోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా సమితి సభ్యులు, కొత్తగూడెం పట్టణ సహాయ కార్యదర్శి కంచర్ల జమలయ్య తెలిపారు. స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో సోమవారం జరిగిన కొత్తగూడెం పట్టణ కార్యవర్గ సభ్యులు ముఖ్య నాయకుల సమావేశంలో జమలయ్య మాట్లాడుతూ భారతదేశంలో వందేళ్ల చరిత్ర గల ఏకైక పార్టీ సిపిఐ అని, స్వతంత్ర పోరాటంలో సిపిఐ కీలకపాత్ర పోషించిందని, స్వతంత్ర అనంతర దేశ నిర్మాణంలోను కీలక భూమిక పోషించిందని తెలిపారు. వసంతోత్సవాల సందర్భంగా అన్ని వార్డుల్లో జెండావిష్కరణలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ర్యాలీకి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈస మావేశంలో భూక్యా శ్రీనివాస్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, ధర్మరాజు, బోయిన విజయ్‌కుమార్, జహీర్, ప్రభాకర్, ఎర్రబెల్లి శంకర్, నేరెళ్ల శ్రీనివాస్, దాట్ల శ్రావణ్, ఇర్ఫాన్, నేరెళ్ల రమేష్, అజయ్, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ వేడుకల్లో అరుణోదయ మెరిట్ స్కూల్



**ప్రజాపక్షం/పెనుబల్లి:** అరుణోదయ మెరిట్ స్కూల్ నందు సెమి క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిగాయి. బాలికలు దేవదూతల వేషధారణలో తెల్లటి దుస్తువులతో, బాలురు శాంటా క్లాస్ వేషధారణలో కనిపించి కనువిందు చేశారు. బైబిల్ మిషనరి ఫాదర్ రాజు ప్రార్థనలు చేసి ప్రతి విద్యార్థి మంచి నడవడిక, నైతిక విలువలు పెంపొందించుకోవాలన్నారు. ఉన్నత చదువులు చదివి పాఠశాలకు మరియు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. విద్యార్థులు జీసస్ పాటలకు నృత్య ప్రదర్శన చేసి కనుల విందు చేశారు. యేసయ్య చరిత్రను నాటక రూపం కనబరిచి విద్యార్థులు అందరూ కూడా మనసుకు హత్తుకుపోయేలా నటించారు. పాఠశాల డైరెక్టర్స్ మరియు ప్రిన్సిపాల్ ప్రభువు ఎదుట క్యాండిల్ వెలిగించారు. టీచర్స్ మరియు తల్లిదండ్రులతో కలిసి కేక్ ను కట్ చేసి బాల బాలికలకు తల్లిదండ్రులకు మరియు ఉపాధ్యాయ బృందానికి పంచిపెట్టారు. ఉపాధ్యాయులు అందరూ ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ బహుమతులు ఇచ్చుకున్నారు. తదుపరి డైరెక్టర్ బి శంకర్, వి శ్రీను మరియు ప్రిన్సిపాల్ నేతాజీ ప్రసాద్, క్రిస్టియన్ బంధు మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# మాజీ ప్రధాని పివి నరసింహారావుకి నివాళి



**ప్రజాపక్షం/ తల్లాడ :** భారతదేశ మాజీ ప్రధాని స్వర్గీయ పివి. నర్సింహారావుకు రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు నారపోగు వెంకట్ నివాళులర్పించారు. సోమవారం హైద్రాబాద్‌లోని పివి ఘాట్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకట్ మాట్లాడుతూ పివి నర్సింహారావు ప్రధాని మంత్రిగా దేశానికి అనేక సంస్కరణలు తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తుందని, ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తుందని తెలిపారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకెళ్లాలని కోరారు. నివాళులర్పించిన వారిలో తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వర్లు, శీలం కోటారెడ్డి, ఎర్రి నర్సింహారావు, బాణోతు నర్సింహారావు తదితరులు ఉన్నారు.

# మార్పు అంటే విగ్రహాలు మార్చడం కాదు.. ప్రజల బతుకులను మార్చండి



**ప్రజాపక్షం/బోనకల్:** మార్పు అంటే విగ్రహాలను మార్చడం కాదని, పేద ప్రజల బ్రతుకులను మార్చాలని, ఆరు గ్యారంటీలను అమలు చేయాలని మాజీ జడ్పీ ఛైర్మన్ లింగాల కమలరాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ కొండబాల కోటేశ్వరరావులు అన్నారు. సోమవారం మండలంలోని నారాయణపురం గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రావాడానికి ఆరు గ్యారంటీల పేరుతో 600 అబద్దాలు ఆడి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కేసీఆర్ రూపొందించి ప్రజాదరణ పొందిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాక్షస ఆనందం పొందేందుకే విగ్రహాల మార్పు, అక్రమ కేసులు, కక్షసాధింపు చర్యలు చేస్తూ అసమర్థ పాలన నడిపిస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ కాలంలో నారాయణపురం ఉద్యమస్ఫూర్తిని నింపిందని అన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌ను తెలంగాణ ప్రజలు తరిమి కొట్టే రోజులు రానున్నాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ బంధం శ్రీనివాసరావు, రైతు నాయకులు వేమూరి ప్రసాద్, మాజీ జడ్పీటీసీ కొండ, మండల కార్యదర్శి మోదుగుల నాగేశ్వరావు, మండల నాయకులు కాకాని శ్రీనివాసరావు, పారా ప్రసాద్, ఎసీ సెల్ నాయకులు గద్దల వెంకటేశ్వరావు,యంగల కనకయ్యక, కొనకంచి నాగరాజు, రవీంద్ర, అచ్చయ్య, వీరబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బరితెగించిన ఇసుక మాఫియా..!

**-అధికార పార్టీ నేతలమంటూ ఇసుక దందా**
**-అడ్డుకున్నే వారిని చంపేస్తామంటూ బెదిరింపులు**
**-అటువైపు చూడని రెవెన్యూ, పోలీస్ అధికారులు**



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండలంలోని మొర్రేడు, పాములేరు వాగులలో ఇసుక నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. ఈ నిల్వలపైన ఇసుక మాఫీయా కన్నుపడింది. అంతే ఏకంగా వాగులోకి ర్యాంపులు వేసి వాటికి గ్రావెల్‌తో రోడ్లు వేసి, రామవరం, పూసుగూడెం, ఆనందపురం, సీతారామపురం గ్రామాల్లో భారీ డప్పులను ఏర్పాటు చేసి, జెసిబీల సహాయంతో లారీతో ఎత్తి ఖమ్మం, సత్తుపల్లి, పాల్వంచ పట్టణాలకు తరలిపిస్తున్నారు. రాత్రి సమయంలో ఇసుక రవాణా చేస్తున్న సమయంలో గ్రామస్తులు ఎవరైనా అడిగితే చంపేస్తామని ఇసుక దందా రాయుళ్ల బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్న ఇటు పోలీస్, అటు రెవిన్యూ అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వారి అండదండలతోనే ఈ దందా జరుగుతున్నాయని విమర్శులు వినిపిస్తున్నాయి. మండలంలో ఏ దందా జరిగినా టాస్క్ ఫోర్స్, విజిలెన్స్ వారు వచ్చి దాడులు చేసే వరకు మండల అధికారులకు తెలియకపోవడం గమనార్హం.

# ఆగని కాపర్ వైరు చోరీ

**-ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు**



**ప్రజాపక్షం/ఖమ్మం :** ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ వైరు చోరీలు ఆగడం లేదు. జిల్లాలో వ్యవసాయ, వాణిజ్య పరమైన అవసరాల కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి వరుసగా కాపర్ వైరు చోరీ చేయడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓ ముఠా ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ ముఠా చేస్తున్న చోరీలను అరికట్టడంలో విఫలమవుతున్నారు. వాణిజ్య పరమైన, వ్యవసాయ అవసరాల కోసం వేసిన ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ వైరు చోరీ జరుగుతుండడంతో రోజుల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా ఖమ్మం రూరల్ మండల పరిధిలోని ఆరెంపుల గ్రామంలో ఏర్పాటు చేసిన 25కెవి ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్ వైరు చోరీ చేశారు. మూడు రోజుల క్రితం విద్యుత్ సరఫరా నిలిచిపోయిన విషయాన్ని గమనించి విద్యుత్ శాఖాధికారులను శ్రీవెంకటేశ్వర ప్లైయాష్ బ్రిక్స్ కంపెనీ యజమాన్యం సంప్రదించింది. విద్యుత్ పునరుద్దరణ కోసం విద్యుత్ శాఖ సిబ్బంది రాగా కాపర్ వైరు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి చోరీ జరిగినట్లు గుర్తించారు. వినియోగదారులు ఈ మేరకు అటు విద్యుత్ శాఖకు, పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ మార్పుకు జాప్యం జరుగుతుండడంతో వినియోగదారులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్న ఆవేదన వ్యక్తమవుతుంది. కాపర్ వైరు చోరీలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అదుపు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా పోలీస్ అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదని ఎఫ్ఐఆర్ నమోదు చేస్తే తప్ప విద్యుత్ అధికారులు తిరిగి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయలేమని చెబుతున్నారు. ఇటు పోలీసులు, అటు విద్యుత్ శాఖాధికారులు వినియోగదారులకు ఇబ్బందులు రాకుండా చూడాలని కోరుతున్నారు.

# సిపిఐ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/వైరా:** ఈ నెల26 నుండి జరిగే సిపిఐ శత వసంతాల ఉత్సవాలను ఘనంగా జయప్రదం చేయాలని సిపిఐ వైరా నియోజకవర్గ ఇంచార్జి యర్ర బాబు పిలుపునిచ్చారు. వైరా డిసెంబర్ 23 భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 వసంతాల ఉత్సవాలను గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని సిపిఐ వైరా నియోజకవర్గ ఇంచార్జి యర్ర బాబు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం వైరా సిపిఐ కార్యాలయం రజబ్‌అల్లి భవన్‌లో సీనియర్ నాయకులు షేక్ షరీఫ్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న యర్ర బాబు మాట్లాడుతూ భారతదేశంలో డిసెంబర్26 1925న కాన్పూర్‌లో ఆవిర్భవించిన పార్టీ అనేక నిర్బందాలను ఎదుర్కొంది. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన మొదట జాతీయ పార్టీ సిపిఐ అని అన్నారు. దేశంలో భూసంస్కరణ కోసం చేసిన పోరాటంలో అనేక మంది కమ్యూనిస్టు యోధులు సంవత్సరాల తరబడి జైళ్లలో నిర్బందించబడ్డారు అని తెలిపారు. తెలంగాణలో భూస్వాములకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం నడిపి గెరిల్లా యుద్ధం చేసిన పార్టీ సిపిఐ అని అన్నారు. ఈ పోరాటంలో 4500 మంది కమ్యూనిస్టులు అశువులు బాసారు. ఈ పోరాట ఫలితంగా తెలంగాణలో 10 లక్షల ఎకరాలు భూమి నిరుపేదలకు పంచబడింది. నాటి నుండి నేటి వరకు రైతులు కార్మికులు విద్యార్థులు యువకులు మహిళలు నిరుద్యోగులకు సంఘాలు పెట్టి వారి సమస్యల కోసం నిరంతరం పోరాడుతుందని వివరించారు. అటువంటి మహా చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీలో కార్యకర్తలుగా నాయకులుగా పనిచేయడం గర్వకారణంగా ఉందని భావించాలని తెలిపారు. ఈ నెల26 నుండి 2025 రాబోవు సంవత్సరం డిసెంబర్ 26 వరకు జరిగే పార్టీ శత వసంతాల ఉత్సవాలను గ్రామగ్రామాన వాడవాడలా పెద్ద ఎత్తున నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఈ నెల26న శుక్రవారంఖమ్మంలో జరిగే రెడ్ షర్ట్‌ల వాలంటీర్ల కవాతును అనంతరం భక్త రామదాస్ కళాక్షేత్రంలో సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గారపాటి అశోక్, కొండా రమక్రిష్ణ, మేట కొండా, జివిఆర్. బండారుపల్లి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# సోదరభావంతో క్రిస్మస్ వేడుకలు జరుపుకోవాలి




**ప్రజాపక్షం/బోనకల్:** కుల, మతాలకు అతీతంగా సోదర భావంతో క్రిస్మస్ వేడుకలను జరుపుకోవాలని తహసీల్దార్ అనిశెట్టి పున్నం చందర్ అన్నారు. మండల కేంద్రంలోని దివ్య దయాల్ వృద్ధుల ఆశ్రమంలో తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు, ప్రేమ విందు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పున్నం చందర్ మాట్లాడుతూ.. తమని తాము ప్రేమించుకోవడంతో, పరుల పట్ల అప్యాయత, దయ, జాలి, తోటివారికి సాయం పడడమే ఏసు మార్గమని అన్నారు. సర్వ మతాలకు రక్షణగా ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎవరు కూడా మరో మతానికి సంబంధించి వ్యతిరేకంగా మాట్లాడే చర్యలను ప్రభుత్వం సహించబోదని అన్నారు. ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా చూస్తుందని, ప్రభుత్వం అందించే పథకాలు అందరికీ సమానంగా అందుతాయని అన్నారు. ప్రభుత్వ అందించే పథకాలను, సేవలను సద్వినియోగించుకోని ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రురావత్ రమాదేవి, ఎంఈఓ దామాల పుల్లయ్య, ఆర్ఐ గుగులోత్ లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు బిపి నాయక్, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు,టిఆర్ఎస్ నాయకులు యాకోబ్, మండల పాస్టర్ ఫెలోషిఫ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రేచర్ల వెంకటేష్ ఉషారాణి దాతృత్వం అభినందనీయం




**ప్రజాపక్షం/వైరా:** రేచర్ల ఉషారాణి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రేచర్ల వెంకటేష్ వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఫిషరీస్ కాలనీ ప్రాధమిక పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు భోజనం అందించి పాఠశాలకు నాలుగు కుర్చీలను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅ తిథిగా హాజరైన వైరా మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, విద్యార్థులకు భోజనం వడ్డించిన అనంతరం మాట్లాడుతూ రేచర్ల వెంకటేష్ పాఠశాల విద్యార్థులందరికి భోజనం అందించి పాఠశాలకు భౌతిక వసతులు కల్పించడం నిజంగా అభినందనీయమని కొనియాడారు. వైరా మండల విద్యాశాఖ అధికారి కొత్తపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ పాఠశాలకు భౌతికవసతులు సమకూర్చి పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించడం అనేది నిజంగా వారి ధాతృత్వానికి నిదర్శనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు ఖమ్మం జిల్లా శాఖ అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెలిశెట్టి నర్సింహారావు, జి.మాధవరావు, డి.సత్యనారాయణ, యలమద్ది వెంకటేశ్వర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఆది రజిని, మాదినేని పాపారావు, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## వైరాలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే




**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రిస్మస్ వేడుకలు వైరా కామిశెట్టి కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది. మీ అందరికి ఆ ప్రభువులు దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని ఆ ప్రభువును కోరుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా మండల ఫాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ నాయకులు, మండల రెవెన్యూ అధికారి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, కౌన్సిలర్ కన్నెగంటి సునీత, దొడ్డా పుల్లయ్య, బోళ్ళ గంగారావు, పమ్మి అశోక్, చప్పిడి వెంకటేశ్వరరావు, ఫణితి శ్రీను, మల్లు రామకృష్ణ, కన్నెగంటి హుస్సేన్, దార్న రాజశేఖర్, ఏదునూరు శ్రీను, ఇటుకల మురళి, పఠాన్ జాన్, మురళి, తేజావత్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న వైరా ఎమ్మెల్యే




**ప్రజాపక్షం/ఏన్కూరు:** మండల కేంద్రమైన ఏన్కూరు రైతేవదిక నందు సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు అధికారులు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ సోదరీ,సోదరీమణులు పాటలు పాడి ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, అధికారులు కేక్ కట్ చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రిస్మస్ వేడుకలు నిర్వహించడం ఎంతో సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శేషగిరిరావు, ఎంపిడివో రమేష్, సొసైటీ అధ్యక్షులు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, స్వర్ణ నరేందర్, వేముల కృష్ణప్రసాద్, ప్రభావతిరెడ్డి, భూక్యా లాలునాయక్, లచ్చిరాంనాయక్, వీరునాయక్, మాలోతు నర్సింహారావు, పోతుల సైదులు, పూసం సుధీర్,నల్లమల శివకుమార్, నిమ్మల నాగేశ్వరరావు, గిద్దగిరి సత్యనారాయణ, చింతనబోయిన సీతారాములు, పంతగాని నరేష్, రోహిత్‌సాయి, శేఖర్, ఫాస్టర్లు అద్భుతకుమార్, ఫ్రాన్సిస్, జాస్పాల్, చౌరీ, ఫిట్టర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర 6వ విద్యా వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయండి

**-టిఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిడిఎస్.నాగేశ్వరరావు**

**ప్రజాపక్షం/ఏన్కూరు:** ఈ నెల 28,29,30 తేదీల్లో నల్లగొండలో జరిగే టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర 6వ విద్యా, వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని టిఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బురదరాఘవాపురం పాఠశాలలో టిఎస్‌యుటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల గోడపత్రికలను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రామ్‌చంద్, ఎం.పుల్లయ్య, పాఠశాల ఇంచార్జి హెచ్‌ఎం ఎస్.సుజాత, మూలపోచారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.నాగరాజు, శ్యాంకుమార్, బి.నాగేశ్వరరావు, బి.రామారావు, డి.నరేష్, జి.సునీల్‌వర్మ, రాధాకృష్ణ, శంకర్‌రావు, పుల్లయ్య, రాఘవరావు, శ్యామల, ఉషశ్రీ, రవి, సింగ్యా, శోభన్, శ్రీదేవి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.